ఆరోగ్య సురక్షలో 440 మందికి పరీక్షలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని కాట్రావులపల్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో 440 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కాట్రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజశేఖర్ అధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామంలోని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరం కేసులు ఎక్కువగా నమోదు కావడంతో రక్త పరీక్షలు చేశారు. వాతావరణం మార్పులతో జ్వరం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిట్టా సుగుణరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్ కుమార్, ఈఓపిఆర్డి, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, వైసిపి నాయకులు సురిమిల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

డెల్టాఫిష్ వర్తక సంక్షేమ సంఘం నూతన భవనం ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం ఈదరపల్లిలో శ్రీ కోనసీమ సెంట్రల్ డెల్టా ఫిష్ వర్తక సంక్షేమ సంఘ నూతన భవనన్నీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు, ఏఎంసి చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, తుని నియోజకవర్గ వైసిపి పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, బొంతు గోవింద్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి అర్బన్ అమలాపురం బ్యాంకు శాఖకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గోదావరి అర్బన్ మల్టీ స్టేట్ క్రెడిట్ కో-ఆపరేటివ్ ప్రథమ బహుమతి లభించినట్లు బ్రాంచి మేనేజర్ దొంగ రామచంద్రమూర్తి తెలిపారు. నాందెడ్‌లో జరిగిన పదవ వార్షికోత్సవం సందర్భంగా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ తంబేకర్ చేతుల మీదుగా అమలాపురం బ్యాంక్ మేనేజర్ దొంగ రామచంద్ర మూర్తి బహుమతిని అందుకున్నారు. బ్యాంకు ద్వారా బంగారంపై రుణాలు అందించడంలో ఖాతాదారులకు అందించిన సేవలకు ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు మూర్తి తెలిపారు. బ్యాంకు వ్యవస్థాపకులు హేమంత్ పటేల్ మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించి బ్యాంకును మరింత ఉన్నత స్థాయిలో తీసుకురావాలని అన్నారు. ఎండి తంబేకర్ మాట్లాడుతూ సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి కృషి వల్ల బ్యాంకు మరింత రాణిస్తుందని అన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగుతున్న నిరసనలు

విశాలాంధ్ర - జగ్గంపేట : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జగ్గంపేటలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. 20వ రోజు దీక్షలను నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ హాజరై పాస్టర్స్ అందరికీ నల్ల కండువాలు వేసి దీక్షల్లో కూర్చోబెట్టారు. అనంతరం దైవ సేవకులు సిలువలు పట్టుకుని చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసులన్నీ తొలగిపోవాలని సత్యశీలుడుగా బయటకు రావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, వెలిశెట్టి శ్రీనివాసరావు, రేఖ బుల్లి రాజు, వెలిశెట్టి బుజ్జి, పాస్టర్ వెలిశెట్టి రాంబాబు, ఎస్‌వి ప్రసాద్, తదితరు పాస్టర్లు పాల్గొన్నారు.

భువనేశ్వరికి రాజేశ్వరి సంఘీభావం

విశాలాంధ్ర-దేవరపల్లి : జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ ఇమ్మని రాజేశ్వరి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కాట్రగడ్డ శ్రీనివాస చౌదరి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని కలిసి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఇమ్మని రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి చాలా తప్పు చేసిందని అన్నారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

విశాలాంధ్ర - గోపాలపురం : మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు వాయిదా పట్టడంతో మర్రి వెంకటేశ్వరరావు (70) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఎర్రవరం గ్రామంలో చోటు చేసుకుంది. మృతుని బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తెలుగుదేశం అభిమాని అయిన మర్రి వెంకటేశ్వరరావు మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందినవాడు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ ప్రతిరోజు బెయిల్ కొరకు కనిపెడుతూ ఉండేవాడు. బుధవారం సాయంత్రం సుప్రీంకోర్టులో జరుగుతున్న వాదనలు టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రచారం చూస్తూ బెయిల్ మంజూరు విషయంలో వాయిదా పడిన సంగతిని చూసి కలతకు గురైనట్లు తెలిపారు.బుధవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే చనిపోయినట్లు బంధువులు తెలిపారు.

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

విశాలాంధ్ర-దేవరపల్లి :వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగం అమలు జరుగుతోందా అనే ప్రశ్న అందరిలో ఏర్పడిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. రాష్ట్రంలో ర్యాలీలు నిరసనలు తెలియజేయటానికి ప్రతిపక్షాలు వివిధ సంఘ నేతలు పూనుకుంటే అక్రమ అరెస్టులు గృహనిర్బంధాలు చేస్తున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగున్నర సంవత్సరాలలో రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని అన్నారు. సమావేశంలో తెలుగుదేశం సీనియర్ నేతలు కే రవికుమార్, బి. శ్రీధర్, మల్లెల వెంకటేశ్వరరావు, ముప్పిడి అశోక్ కుమార్, పసలపూడి దేవా తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువులో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - అయినవిల్లి : మండలంలో నల్లచెరువు గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అయినవిల్లి పిహెచ్‌సి డాక్టర్ మంగాదేవి ఆధ్వర్యంలో వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పిగన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఈ శిబిరాన్ని సందర్శించి, సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసంగించారు. సర్పంచ్‌లు గుమ్మడి ప్రసాద్, బొక్కా కామేశ్వరరావు, మండల వైసిపి అధ్యక్షుడు కుడుపూడి విద్యా సాగర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం

- వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు
- కాకినాడ ఎంపీ వంగా గీత
- కాకినాడలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ప్రతి పేదవానికి మెరుగైన ఆరోగ్య సేవలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక కొండయ్యపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమైంది. సిటీ ఎమ్మెల్యే ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వంగా గీత మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య రంగంలో ఏపీలో అమలు చేస్తున్న పాలనా సంస్కరణలు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చాయన్నారు. పట్టణ ప్రాంతాలలో యూపీహెచ్‌సిల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి రెండు వేల జనాభాకు వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటు, పోస్టుల భర్తీ వంటి ఎన్నో చర్యలు సీఎం తీసుకున్నారన్నారు. 24 గంటలూ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ చేయడమే సీఎం లక్ష్యమన్నారు.

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణం సీఎం ప్రాధాన్యతలుగా పేర్కొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌడా మాజీ చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైయస్సార్సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సిఐ కాలనీ అభివృద్ధికి సహకరిస్తా

కాలనీవాసులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే కన్నబాబు హామీ

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఎఫ్‌సిఐ కాలనీవాసుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, మౌలిక వసతులు కల్పిస్తానని మాజీ మంత్రి, జిల్లా వైకాపా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబు హామీ ఇచ్చారు. స్థానిక రమణయ్యపేట నాలుగో సచివాలయం పరిధిలో ఉన్న ఎఫ్‌సిఐ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కన్నబాబు పాల్గొని ఇంటింటికి వెళ్లి పర్యటించారు. ముందుగా ఎఫ్‌సిఐ కాలనీ సందర్శించిన కన్నబాబుకు వైసిపి లీడర్ కాలనీ ఇన్‌చార్జి దేవులపల్లి సురేష్ ఆధ్వర్యంలో గజమాలతో, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాలనీ వాసులు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని, కరెంటు వైర్లు బిల్డింగులకు తగలకుండా వంగి ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని, వర్షపు నీరు నిలవకుండా ఉండేటట్లు చూడాలని కన్నబాబును కోరగా, ఆయన వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ముందస్తుగా కరెంటు స్తంభాలను మార్చాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం రమణయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంజా సత్తిబాబు, పాలిక నరసింహమూర్తితో కలిసి జన చైతన్య కాలనీ, పెంకె వారి కాలనీ, సాయి బావాజ్జ కాలనీ పర్యటించి జగనన్న సంక్షేమ పథకాలు నవరత్నాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోపిశెట్టి పద్మజ బాబ్జి, డిఎల్డిఓ పాతం సిటీ సత్యనారాయణమూర్తి, ఎమ్మార్వో మొరార్జీ, పంచాయతీ కార్యదర్శి దవులూరి రమణ, వీఆర్వో తాతారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అత్యుత్తమ సేవలు

విశాలాంధ్ర - ఆలమూరు : పేద ప్రజల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నాణ్యమైన అత్యుత్తమ సేవలను అందిస్తూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దుతున్నారని సర్పంచ్ నేలపూడి లావణ్య కొనియాడారు. ఆలమూరు గ్రామ సచివాయం-1 పరిధిలో ఎంపిడివో కె జాన్ లింకన్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఆస్పత్రికి చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు ఇ. మౌళి, పి. వసంత లక్ష్మి, ఆర్. మల్లిఖార్జున, పి.భవానీ శంకర్, శిరీష పాల్గొని 387 మందికి మెరుగైన వైద్య సేవలు అందించి 106 రకాల మందులను ఉచితంగా అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ఏడుగురిని గుర్తించి వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రాజమహేంద్ర వరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఏర్పాటు చేసిన 38 రకాల పౌష్టికాహార వంటకాలు, పండ్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్యారోగ్య సిబ్బంది అందించిన సేవలు సంతృప్తికరంగా ఉన్నట్లు ఎంపిడివో జాన్ లింకన్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కర్రి సంజీవరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవివి రాజా, సూపర్వైజర్లు ఎం. శ్రీనివాసరావు, పి. ఉమ, ఫార్మాసిస్టు సుగుణ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుండలేశ్వరం పంచాయతీలో నిధుల దుర్వినియోగం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కుండలేశ్వరం గ్రామపంచాయతీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండానే సర్పంచ్ గోకరకొండ గౌరీ వెంకట సుబ్బలక్ష్మి ఎనిమిది లక్షల రూపాయలు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసారని స్థానిక ఎంపిటిసి అక్కల శ్రీధర్ ఆరోపించారు. బుధవారం కుండలేశ్వరం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ,పంచాయతీ కార్యదర్శి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అర్జీలు, పిర్యాదులతో హాజరై పంచాయతీ కార్యదర్శిని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. పంచాయతీ నిధులతో సర్పంచ్ గ్రామంలో ఎంటువంటి అభివృద్ధి పనులు చేయకుండా కాజేశారని అన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో పంచాయతీలో అక్కరకురాని పనులు చూపించి ఎనిమిది లక్షలు రూపాయలు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఎంపీటీసీ పేర్కొన్నారు. సర్పంచ్ కూర్చునే కుర్చీకే డబ్బై వేల రూపాయలు ఖర్చుచేసారని, మంచినీటి కుళాయి పైపులు పశువులు తొక్కివేసాయనే నెపంతో లక్షా ముప్పై వేల రూపాయలు మరమ్మత్తులు చేసినట్టు తప్పుడు లెక్కలు చూపించారని ఎంపిటిసి పేర్కొన్నారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ సరైన సమాధానం చెప్పకపోవడంతో గ్రామప్రజలు చేసేదిమిలేక గ్రామసభ నుండి వెళ్లిపోయారు. నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తానని ఎంపీటీసీ తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సొసైటీ అధ్యక్షులు అక్కల శివరామకృష్ణ, పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గోకవరం ఎంపీపీ ఏవోగా ముత్యాల ప్రసాద్

విశాలాంధ్ర- గోకవరం : మండల ముఖ్య కేంద్రమైన గోకవరం మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరుగా ముత్యాల ప్రసాదు నూతనంగా తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. రాజమహేంద్రంలోని ఇంజనీరింగ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ప్రమోషన్‌పై గోకవరం ఎంపీపీ కార్యాలయంలో ఏవోగా నియమితులయ్యారు



ఏడేళ్ల చిన్నారి పై అత్యాచారం

ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన

విశాలాంధ్ర - రాజానగరం : ఆరుబయట ఆటలాడుకుంటున్న ఏడేళ్ల చిన్నారిపై 17 ఏళ్ల యువకుడు తన కామవాంఛను తీర్చుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గంలోని మధురపూడి గ్రామానికి చెందిన ఓ బాలిక మండలంలోని ఒక గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి రెండు నెలలు క్రితం తల్లిదండ్రులతో కలిసి వచ్చేసినట్లు చెప్పారు. బాలిక తల్లి స్థానికంగా ఒక హోటల్‌లో పని చేస్తోందని, తండ్రి తాపీ పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపధ్యంలో ఆదివారం ఎవరు లేని సమయంలో అదే గ్రామానికి చెందిన 17ఏళ్ల యువకుడు ఆ బాలికకు బిస్కట్లు ఆశచూపి పక్కనే వున్న ఓ ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారం చేసినట్లు చెప్పారు.రక్తస్రావంతో ఏడుస్తున్న బాలికను చూసిన కుటుంబ సభ్యులు, స్థానికులు చిన్నారిని ప్రశ్నించగా జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు చెప్పారు. నిందితుడు ఆటో డ్రైవర్ గా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. తల్లిదండ్రులు బుధవారం రాజానగరం స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రవళి స్పిన్నర్స్ విస్తరణ యూనిట్లకు సీఎం జగన్ వర్చువల్ శంకుస్థాపన

విశాలాంధ్ర-పెరవలి : 150 కోట్ల రూపాయలతో స్థాపించే రవళి స్పిన్నర్స్ విస్తరణ పనులకు కోరుకొండ మండలంలో హైటెక్ ఫార్మా మిల్లెట్ ప్రాసెస్ యూనిట్స్‌కు బుధవారం ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. పెరవలి మండలం ఖండవిల్లి లో రవళి స్పిన్నర్స్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సిహెచ్. శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ, హెూం మంత్రి డాక్టర్ తానేటి వనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ కె. మాధవీలత, రవళి స్పిన్నర్స్ ఫౌండర్ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టరు కె. మాధవీలత మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన మూడు పరిశ్రమలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వాటిలో రూ.150 కోట్లతో ఖండవల్లిలో రవళి స్పిన్నింగ్ మిల్లు విస్తరణ శంఖుస్థాపన, కోరుకొండ మండలం కనుపూరు లో రూ.4.5 కోట్ల తో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కు శంఖుస్థాపన చెయ్యగా, 3 ఎఫ్ ఆయిల్ పామ్ తో రూ.250 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నారని తెలిపారు.

సిఎం క్యాంపు కార్యాలయంలో :గుంటూరు జిల్లా తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రవళి స్పిన్నింగ్ మిల్లు డైరెక్టర్ సింహాద్రి రవళి మాట్లాడుతూ రవళి స్పిన్నింగ్ మిల్లు ద్వారా 70 శాతం మంది స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. మహిళలు ఆధారితంగా రవళి పరిశ్రమ పనిచేస్తున్నట్లు, ఇక్కడ ఎక్కువ శాతం మహిళలే పనిచేస్తున్నట్లు తెలిపారు. సిఎం ఆశయాలకు అనుగుణంగా ఈ పరిశ్రమలో 90 శాతం మంది స్థానికులకే ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఇచ్చినట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ ఆరోగ్యం

హోంమంత్రి తానేటి వనిత

విశాలాంధ్ర-కొవ్వూరు : ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలందరికి ఆరోగ్య పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు అందచేయడంతో పాటు అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర హెూంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. ప్రభుత్వం అంటే ప్రజలకు సేవ చేయడం అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, అది ప్రభుత్వ విధానమన్నారు. బుధవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం, కొవ్వూరు మండలం చిడిపి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ ను పరిశీలించారు, స్టాళ్లలోని వైద్యులతో, సిబ్బందితో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో పాటు చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్ వైద్య నిపుణులు, ఇతర వ్యాధులకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

4.7 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - రాజానగరం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని కొంతమంది అక్రమంగా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ(పిడిఎఫ్)వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే 4.7 టన్నుల రేషన్ బియ్యాన్ని అశోక్ లేలాండ్ కంపెనీ వ్యాన్ లో అక్రమంగా రవాణా చేస్తుండగా పౌర సరఫరా శాఖ, విజిలెన్స్ అధికారులు కలిసి బుధవారం పట్టుకున్నారు. మండలంలోని దివాన్ చెరువు వద్ద జాతీయ రహదారి పై వాహన తనిఖీ లో బాగంగా 4720 కేజీల పిడిఎఫ్ బియ్యాన్ని పట్టుకు న్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఓ కమల్ సుందర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు వాహనాలు సోదాలు చేస్తుండగా ఏపీ39 యూఎన్ 4870నంబరు గల అశోక్ లేలాండ్ వ్యాన్ తనిఖీ చేసినట్లు చెప్పారు.ఈ నేపథ్యంలో వ్యాన్ డ్రైవర్ శీరామ్ దాస్ తమ్మరావు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు తిరుపూరు నుండి కాకినాడ పోర్టుకి వెళ్తున్నట్లు చెప్పారు.వాహనం యజమాని టి.దుర్గ ప్రసాద్,బియ్యం ఓనర్ ఎం.కోటేశ్వరరావుగా గుర్తించామన్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని ప్రభుత్వ గోడౌన్ కి తరలిస్తున్నట్లు చెప్పారు. దీంతో వ్యాన్ డ్రైవర్ శీరామ్ దాస్ తమ్మరావ్ అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ సోదాల్లో విజలెన్స్ సిఐ టీ.శ్రీనివాస్ రెడ్డి, ఏజి ఎస్వి లక్ష్మి నారాయణ, కానిస్టేబుల్స్ ఎస్.కె.వల్లి, సిహెచ్.కిషోర్ తదతరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా కోండగుంటూరు గ్రామంలో అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కొండగుంటురు కి చెందిన పెంటగట్ల రాజబాబు అన్నారు. మండలం లోని కొండ గుంటూరుకు చెందిన ఆయన బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ కోండగుంటూరు గ్రామంలో 644/1, 644/2 సర్వే నెంబర్లో అక్రమ మైనింగ్ జరుగుతుందన్నారు.ఎర్ర గ్రావెల్ మట్టిని తవ్వకుండా మండల అధికారులు, జిల్లా అధికారులు చోరవ చూపాలన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడకుండా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు,మెట్టలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమతో పాటు పెమ్మనబోయిన వెంకటేష్, రఘు, కోండగుంటూరు గ్రామ ప్రజలు తదితరులు సంఘటన స్థలానికి పరిశీలించినట్లు తెలిపారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

దోష రహిత ఓటరు జాబితా రూపకల్పను సహకరించండి

విశాలాంధ్ర - కాకినాడ : ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా-2024 రూపకల్పనలో భాగంగా బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీధర్ రెడ్డి..గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా పరిశీలనలో వచ్చిన అభ్యంతరాలు, ఫాం 6, 7, 8 పరిష్కారాలు, మార్పులు చేర్పులు, పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ, కొత్త ఈవీఎం, వీవీ ప్యాట్స్ పరిశీలన షెడ్యూల్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతివారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోష రహిత ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్ వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ కాంగ్రెస్), పెదిరెడ్డి రవికిరణ్ (భాజపా), గదులు సాయి బాబా(టీడీపీ), కె వీరబాబు (సీపీఎం), ఎస్ అప్పారావు (బీఎస్పీ), ఎన్ శివ(ఆమ్ ఆద్మీ), కలెక్టరేట్ ఎన్నికల డీటీ ఎం జగన్నాథం ఇతర అధికారులు తదితరులు హాజరయ్యారు.

జగనన్న ఆరోగ్యో సురక్షలో 610 మందికి సేవలు

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 610 మందికి వైద్య సేవలు అందించారు. మండలంలోని చినకొండేపూడి గ్రామంలో గల సచివాలయం 2 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష డాక్టర్ ఎన్. రాజు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ గ్రామాల్లో సైతం ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న దృఢ సంకల్పంతో జగనన్న వైద్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపడుతున్నదని అన్నారు. దీనికి 610 మంది ఓపీకి రాగా 50 మందికి కళ్ళజోళ్లు పంపిణీ , 75 మందికి రక్త పరీక్షలు చేశామని అన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తి పండు రాజు, కార్యదర్శి సత్య వేణి, 30 వైద్య సిబ్బంది, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్‌లో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నీ మొదటి దశ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఎంతో ఉత్సాహకారమైన వాతావరణంలో క్రికెట్ పోటీలు సాగాయి. తుది దశ సమరం ఉత్కంఠ మధ్య జరిగింది. లీగ్ దశ ఫైనల్‌లో గంగపల్లె అంబేద్కర్ యూత్, కింగ్స్ 11 కాకినాడ జట్లు కప్పు కోసం తలపడ్డాయి. ఈ ఉత్కంఠ మ్యాచ్‌లో తొలుత బాటింగ్ చేసిన గంగపల్లె అంబేద్కర్ యూత్ జట్టు 6 వికెట్ల నష్టానికి 49 పరుగులు సాధించింది. కింగ్స్ 11 కాకినాడ 5.4 ఓవర్లో 2 వికెట్ల నష్టంతో 52 పరుగులు సాధించి లక్ష్యాన్ని ఛేదించింది. తద్వారా సానా సతీష్ బాబు ఛాంపియన్షిప్ మొదటి లీగ్ ఫైనల్ విజేతగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. 3 పరుగులు చేసి, 3 వికెట్లు తీసిన సత్యనారాయణకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది. ముఖ్య ఆహ్వానితులుగా విచ్చేసిన బిల్డర్ నెక్కంటి శ్రీనివాస్ చేతుల మీదుగా విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నరప్ జట్టుకు రూ.8 వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు వెయ్యి రూపాయలు ప్రైజ్ మనీ అందజేశారు. పోటీలను విజయవంతం చేసినందుకు క్రీడాకారులు, వీక్షకులు, క్రికెట్ అభిమానులు మ్యాచ్ నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వి.భాస్కర్ రావు, కెవివి సత్యనారాయణ, ఎస్. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప నక్క సూర్యనారాయణమూర్తి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించినట్టు జిహెచ్‌ఎం లీలా మనోహర్ తెలిపారు. ఈ మెటీరియల్‌ను 1996, 97 సంవత్సరం చదివిన జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు అందించారన్నారు. 2024లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 1984-85 సంవత్సరంలో చదివిన హైస్కూల్ పూర్వ విద్యార్థులు రూ.5000, రూ.3000, రూ.2000లు ఆగస్టు 15న పారితోషికం అందిస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారని హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ శ్రీరామచంద్రమూర్తి, నక్క బుజ్జి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, నక్క సత్తిబాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, మాజీ స్కూల్ చైర్మన్ వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

తుగ్లక్ పాలన మాకొద్దు

చంద్రబాబునాయుడి అరెస్టుపై వినూత్న నిరసన

విశాలాంధ్ర - రావులపాలెం : ఈ తుగ్లక్ పాలన మాకొద్దు బాబోయ్ అంటూ చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు నిరసనగా రావులపాలెంలో తుగ్లక్ వేషధారణ వున్న వ్యక్తితో కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బండారు సత్యా నందరావు నిరసన తెలియజేశారు. రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద 22వ రోజు క్లస్టర్ - 10 (ఆలమూరు, కలవచర్ల, పెనికేరు, చింతలూరు, సూర్యారావుపేట, సంధిపూడి, పెదపళ్ల, పినపళ్ళ, జొన్నాడ) గ్రామాల వారు, క్రిస్టియన్ విభాగం వారి ఆద్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. రాష్ట్రాన్ని నాశనం చేస్తూ, రాజధానిని ముక్కలు చేసి, అక్రమ అరెస్టులతో తుగ్లక్ పాలన నడుస్తుందని అన్నారు. ఈ పిచ్చి తుగ్లక్‌ను రాష్ట్రం నుండి ప్రజలు తన్ని తరిమేయాలని, అలాంటి రోజులు వస్తాయని సత్యానందరావు ధీమా వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో క్లస్టర్-10 (ఆలమూరు, కలవచర్ల, పెనికేరు, చింతలూరు, సూర్యారావుపేట, సంధిపూడి, పెదపళ్ల, పినపళ్ళ, జొన్నాడ) గ్రామాల వారితో పాటు రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - రావులపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రావులపాలెం గ్రామంలో రావులపాలెం-3 సచివాలయ పరిధిలో చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం సిఆర్‌సి రోడ్డు వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దుర్గారావు దొర, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం. ముక్కంటి, ప్రత్యేక వైద్య అధికారులు పాల్గొని 506 మంది ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సదుపాయం పొందారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కర్రి లక్ష్మి వెంకట నాగాదేవి, జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ తాడేపల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలి

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గవరపాలెంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణ

ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పించి వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3,500 వ్యాధులకు పైగానే కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రజలకు వైద్యాన్ని మరింతగా దగ్గర చేసేందుకు వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి స్థానికం గానే ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఉన్నప్పటికీ రోగులను తప్పుదోవ పట్టించి వారికున్న వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలోకి రావడం లేదని, రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.

డాక్టర్ అవతారమెత్తిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ : గవరపాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అక్కడున్న ప్రజలతో మాట్లాడారు. ఈ గ్రామంలో ఎక్కువ మందికి బీపీ, షుగర్ ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారని, ప్రజలు పంచదార వాడకాన్ని, మసాలా వాడకాన్ని తగ్గించుకుంటే ఈ రెండు వ్యాధుల నుండి బయటపడవచ్చని సూచించారు. అదే మాదిరిగా 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ కడలి ధర్మారావు, ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, మాజీ జడ్పిటిసిలు పోలిశెట్టి దాసు, మానుకోండ ప్రదీప్ కుమార్, సర్పంచ్ లు, అధికారులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

విశాలాంధ్ర-భీమడోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఏలూరు ఆర్డీవో ఖాజావలి పిలుపునిచ్చారు. బుధ వారం భీమడోలు హైస్కూల్ ఆవర ణలో విద్యార్థుల పేరున మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ

సందర్భంగా ఏలూరు ఆర్డీవో ఖాజావలి విద్యార్థులతో కలిసి 50 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామయ్య, జడ్పిటిసి భవాని, సర్పంచ్ సునీత, తహసీల్దార్ ఇందిరాగాంధీ, ఎంపీడీఓ పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు.

పేటీఎం సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - గణపవరం: పేటీఎం సంస్థ, మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ గణపవరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ఆరవ తేదీన ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి బుధవారం తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో పేటీఎం సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు, ఈ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 26 సంవత్సరాలు

లోపు వయస్సు కలిగి డిగ్రీ, ఇంటర్మీడియట్ పాసైన పురుష అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హులని ఆమె తెలిపారు. నెలకు జీతం రూ. 16 వేలు, రూ. 6 వేలు బోనస్ ఇతర అలవెన్స్ లు ఉంటాయని ఆమె తెలిపారు. ఈనెల ఆరో తేదీన ఉదయం 10 గంటలకు డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ సెల్ నెంబర్ 9866215054 కు సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న టీడీపీ రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర -భీమవరం: చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి శ్రేణులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం 26వ రోజుకు చేరు కున్నాయి. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, భీమవరం నియోజకవర్గ పరిశీల కుడు రాష్ట్ర కార్యదర్శి దాసరి

ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి తన తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టంగా తయారు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, టిడిపి నాయకులు సయ్యద్ నసీమాబేగం, ఎండి షబీనా, మాదాసు కనకదుర్గ, బి.పద్మ, గంధం రాధ, రేవు వెంకన్న, గూడూరి సుబ్బారావు, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-వీరవాసరం: దేవుని రాజ్యంలోకి ప్రవేశించండి అని జీసెస్ చెప్పింది ధ్యానమేనని ధ్యానం చేయడం ద్వారా జీవితంలో మంచి జరుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ చెన్నా రాంబాబు, గారపాటి సత్యనారాయణలు తెలిపారు. స్థానిక తోటవీధి రామాలయం లో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన పాల్గొని జ్ఞాన బోధ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం అనేది మనలను మనకు పరిచయం చేసే పక్రియ అని, కాయపుటూపిరిలో గని ఉందని, ఊపిరిలో దేవుడున్నాడని యోగీంద్రులకు అన్నమయ్య చెప్పినా, దేవుని రాజ్యం నీలోపలే ఉందన్నారు. అనంతరం భగవద్గీత శ్లోకాల లోని యోగార్థాలను, ధ్యాన విశిష్టతను తెలిపి అందరితో సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, సన్నిధి ఉదయ్, యం.కృష్ణారావు, నాగరాజు, వత్రి కృష్ణవేణి, బి.దేవి.యర్రాయమ్మ సావిత్రి, కమల, ఆదిరెడ్డి గోపమ్మ, జామి పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

విశాలాంధ్ర- ఉంగుటూరు : పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతను ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ఉంగుటూరు మండలం గోపాలపురం సచివాల

యం పరిధిలో రామచంద్రపురంలో నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమానువిత, డిప్యూటీ తాసిల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ గౌతు రాము, ఎంపీటీసీ శ్రీను,యర్రమిల్లి పాడు సర్పంచ్ శ్రీను, నల్లమాడు మాజీసర్పంచ్ రవి, సచివాలయాలు మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

వారాహి యాత్రకు ముదినేపల్లిలో విస్తృత ఏర్పాట్లు

విశాలాంధ్ర -ముదినేపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న వారాహి విజయయాత్ర ముదినే పల్లిలో నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లపై జనసేన మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు (వెంకయ్య)

మాట్లాడుతూ పార్టీ అధినేత యాత్ర మండలంలోని ఈనెల 5న సింగరాయపాలెంలో రోడ్ షోతొ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముదినేపల్లి గురజ రోడ్డు సెంటర్ కు చేరుకుని సభలో పాల్గొంటారు. ప్రధాన రహదారి పొడవున పవన్ కళ్యాణ్‌కు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ నాయకులు సిఎ బి వి రావు , మండల నాయకులు వేల్పూరి నానాజీ , అంబుల భరత్ , లంకపల్లి నాని పలువురు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు 'అక్షజ'

విశాలాంధ్ర- బుట్టాయిగూడెం: మాతా, శిశు మరణాల నివారణ లక్ష్యంగా గర్భిణీల్లో రక్తహీనతను నివారించేందుకు అక్షజ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక యంపిడిఓ కార్యాలయంలో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, మార్పు సేవా సంస్థల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నివారణ లక్ష్యంగా గర్భిణీలలో రక్తహీనతను నివారించేందుకు 6 నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆర్. సూయిజ్, ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ నేతృత్వంలో ప్రోటీన్ కలిగిన పొడి, మునగాకులతో తయారుచేసిన లడ్డులతో కూడిన న్యూట్రిషన్ ప్యాకెట్లను పైలెట్ ప్రాజెక్ట్ గా గిరిజన మండలాలైన జీలుగుమిల్లి, టి. నర్సాపురం, బుట్టాయిగూడెం మండలాల్లో గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణీ మహిళల్లో రక్తహీనత మూలంగా డెలివరీ సమయంలో ఎన్నో

ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు అక్షజ పౌష్టికాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి,ఐటిడిఏ పిఓ యం. సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, మార్పు సేవా సంస్థ ప్రతినిధి ఆర్. సూయిజ్, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ఐసిడిఎస్ పిడి విజయలక్ష్మీ,ఆర్డిఓ ఝాన్సీరాణి, డిఇఓ శ్యామ్ సుందర్, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, డిఎంహెచ్ ఓ డా. ఎస్. శర్మిష్ట, తహశీల్దారు ఎస్.ఎస్. శాంతి, యంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: బుట్టాయిగూడెం జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులను కలిసి రక్తహీనత, పౌష్టికాహార లోపం గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల

హాస్టల్‌లో మరో 150 మందికి అదనపు వసతికి డార్మెటరీ నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఐటిడిఏ పిఓ యం. సూర్యతేజను ఆదేశించారు. అక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందుతున్న వారికి ఉద్యోగ అవకాశాలు పెంపొందించే విధంగా శిక్షణ ఉండాలన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినిలతో మాట్లాడుతూ వారు పొందుతున్న శిక్షణ కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్ ఆఫీసు నేర్చుకున్నానని అది ఇప్పటికీ కూడా తనకెంతె ఉపయోగపడు తున్నదన్నారు. కలెక్టర్ వెంట జిల్లాజాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, ఐటిడిఏ పిఓ యం. సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఆర్డిఓ ఝాన్సీరాణి, డిఇఓ శ్యామ్ సుందర్, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, స్థానిక తహశీల్దార్ ఎస్.ఎస్. శాంతి, యంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటి ముంగిటకే పాలన

విశాలాంధ్ర- వీరవాసరం: ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తెచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలోనే అత్యుత్తమ జననాయకుడిగా నిలిచారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొణితివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గవరపాలెంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివా లయ భవనాన్ని ఎమ్మెల్యే

గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంటే ప్రజలని వారికి పూర్తిస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించాలంటే ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. దేశంలోనే ఒక వినూత్న పాలనతో ప్రజలకు మేలు జరిగే విధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు పూర్తిగా ఉన్నాయని అన్నారు. ప్రజలంతా జగన్ వైపే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సచివాలయ భవనానికి స్థలం దానంగా ఇచ్చిన దాత కుటుంబ సభ్యులైన బీశెట్టి కోటేశ్వరరావు, శ్రీనివాసులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ కడలి ధర్మారావు, ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, మాజీ జడ్పిటిసిలు పోలిశెట్టి దాసు, మానుకోండ ప్రదీప్ కుమార్, సర్పంచ్ లు, అధికారులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందమూరు సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామ సర్పంచ్ శనగన వరలక్ష్మి చెక్ పవర్ ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇటీవల గ్రామంలో మంచినీటి చెరువులో చేపల వేలం వేయకుండా అవకతవకలకు పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదు మేరకు గతంలో చెక్ పవర్‌ను

రద్దు చేశారు. దీనిపై తమ తప్పు లేదని ప్రజల మంచినీటి అవసరాల నిమిత్తమే చెరువులు శుభ్రం చేశామని సర్పంచ్ వరలక్ష్మి ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఈ అంశంపై విచారణ జరిపి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల మంచినీటి అవసరాల నిమిత్తం చెరువు శుభ్రం చేయడం జరిగిందని గ్రామస్తులు తెలపడంతో, సర్పంచ్ తప్పు లేదని వెంటనే చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని డీపీవోను ఆదేశించడంతో చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మిని తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, సర్పంచులు ఛాంబర్ నాయకుడు పోతుల అన్నవరం, మండల టిడిపి అధ్యక్షుడు పరిమి రవికుమార్‌లు అభినందించారు.

జనసేనలో చేరికలు

విశాలాంధ్ర-తణుకు: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు ఆయన చేసిన సేవా కార్యక్రమాలు నచ్చి తణుకు నియోజకవర్గం లోని ఓగిడి గ్రామం, అయినపర్రు గ్రామం నుండి సుమారుగా 50 మంది జనసేన పార్టీలో

చేరారు. అయ్యారు. వీరికి తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం ఓగిడి గ్రామంలో ఇంటింటికి తిరిగి పవన్ కళ్యాణ్ చేసిన సేవా కార్యక్రమాలు ఆయన ఆశయాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం మండలం పార్టీ అధ్యక్షుడు ఆకేటి కాశి, ఇరగవరం మండలం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కైకరం హైస్కూల్లో వనమహోత్సవం

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం హైస్కూల్లో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సీ సీ స్కౌట్ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి,

జడ్పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, ఎంఈఓ శ్రీనివాస్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. ప్రసాదరావు, మానవతా రీజనల్ చైర్మన్ పుష్పాల గోపి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సర్గతులు సిద్ధించడమే మహాలయ పక్షం

విశాలాంధ్ర - అనపర్తి : మహాలయ పక్షాలు పురస్కరించుకొని అనపర్తి సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో సనాతన ధర్మ పరిరక్షణ సమితి గ్రూపు సభ్యుల ఆర్థిక సహాయంతో

పులిహోర, స్వీట్లు, అరటిపండు, మంచినీళ్ల ప్యాకెట్లు వంటి ఆహార పదార్థాలు, వస్త్రాలు పంపిణీ చేసినట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి సురేష్ శర్మ తెలిపారు. బుధవారం ముఖ్యఅతిథి కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి తినాధ రెడ్డి(అన్నయ్య) చేతుల మీదగా పంపిణీ చేసినట్లు సురేష్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ శర్మ మాట్లాడుతూ పితృదేవతలకు భక్తిగా ఆహారాన్ని అందించి వారి ఆకలి తీర్చడమేనని ఈ దానధర్మాలు గతించిన పెద్దలకు సర్గతులు సిద్ధించడం కోసం మహాలయ పక్షం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి రెడ్డి సతీష్, నాగదేవరబాలాజీ శర్మ, కర్రి పాండురంగారెడ్డి, కొవ్వూరి భీమేశ్వర్ రెడ్డి, పడాల విజయ భాస్కర్ రెడ్డి, టి అరుణ్ కుమార్, కె శ్రీనివాస్, ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ సెంటర్లోగల శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి సన్నిధిలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం వద్ద శ్రీ వరసిద్ధి వినాయకుని

ప్రతిష్టించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ఊరేగింపుగా మురమళ్ళ వృద్ధ గౌతమి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర- పెరవలి : కానూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన

దుప్పట్లను, స్టేషనరీ నోట్ బుక్స్, పెన్నులు తదితర పరికరాలు సుమారు 80 మంది విద్యార్థులకు సర్పంచ్ భావన మధు పూర్ణ చందు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లా డుతూ ప్రభుత్వం ఇస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. హాస్టల్ వార్డెన్ వినోద్ రావు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లా కళాకారులకు గుర్తింపు కార్డుల జారీ

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : తూర్పు గోదావరి జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డులు జారీ నిమిత్తం అక్టోబరు 7వ తేదీలోపు తమ వివరాలను రాజమహేంద్రవరం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి పంపాలని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి సిహెచ్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు నూతన గుర్తింపు కార్డు జారీ చేసేందుకు నిర్ణయించిందని, ఆమేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి. విజయకుమార్ రెడ్డి దరఖాస్తులు స్వీకరించాలని తెలియజేశారని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కళాకారులు తమ పేరు, ఫోటో, పుట్టిన తేదీ, బ్లడ్ గ్రూప్, కళారూపం, ఎన్ని సంవత్సరాల అనుభవం, ఆధార్ నెంబరు, చిరునామా, ఫోను నంబరు, పూర్తి చిరునామా తదితర వివరములతో ఎ4 సైజ్ కాగితంపై స్పష్టంగా తెలిసే విధంగా నమోదు చేసి ఈ కార్యాలయ చిరునామాకు పోస్టు ద్వారా పంపాలని ఆయన తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. అక్టోబరు 7వ తేదీ లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని డిఐపిఆర్ సిహెచ్.శ్రీనివాస్ తెలియజేసారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి. సురేంద్ర కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం నుండి ప్రజా పంపిణీ రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో కామవరపుకోట సివిల్ సప్లై డిటి మొహిద్దీన్ తో కలిసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దిపేట మండలం ఇందిరానగర్‌కు చెందిన మహమ్మద్ జమాలుద్దీన్, అయిత కృష్ణలు పిడిఎస్ బియ్యం ను ఎటువంటి అనుమతులు లేకుండా, అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని వారి వద్ద నుండి 20 టన్నుల రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చల్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం ఆ గ్రామసర్పంచ్ ఇసుక పట్ల జయమణి రఘుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని వ్యాదులకు అధునాతన యంత్రాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేసారు. వైద్యాధికారులు డాక్టర్ లోవసుధ, డాక్టర్ సమ్మమ్, డాక్టర్ మనోహర్, కిరణ్, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, ఆరోగ్య విస్తరణా ధికారి విప్పర్తి ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే లీలావతి, జడ్పిటిసి గెడ్డం సంపద రావు, ఎంపిటిసి భోగిశెట్టి సత్యవతి, సర్పింగ్ వైస్ సర్పంచ్ చీకురు మిల్లి నరసింహారావు, ఎంపీడీవో కె విజయ ప్రసాద్, ఇఒ పిఆర్డి కేస్ గౌరి కుమారి, పంచాయతి సెక్రటరీ పెట్టా నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. ఉప్పలగుప్తంలో గురువారం జరుగు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరాయి చెరువు ఎంపిపి పాఠశాల వద్ద జరుగుతుందని ఎండిఓ కెవి ప్రసాద్ తెలియజేసారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మరింతగా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం బుట్టాయిగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బుట్టాయిగూడెం మండలానికి

సంబంధించిన జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ వారితో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఐటిడిఏ పిఓ యం. సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, జెడ్పి సిఇఓ కె. రవికుమార్, ఆర్డీవో ఝాన్సీరాణి ,ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుట్టాయిగూడెంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో 155 అర్జీలు అందాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దారు ఎస్.ఎస్. శాంతి, యంపిడివో వేణుగోపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-దేవరపల్లి : ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో దోహదపడుతుందని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. దేవరపల్లిలో బుధవారం గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమణి జనార్దన్ రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీర కుమార, జడ్పిటిసి పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి నాగేంద్రనాథ్ కృషి అనిర్వచనీయం

విశాలాంధ్ర - కలిదిండి: అన్నదాతల సంక్షేమానికి ఎర్నేని నాగేంద్రనాథ్ కృషి అనిర్వచనీయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని కొండూరు గ్రామంలో నాగేంద్ర నాథ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా

ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులు, డ్రైనేజీ బోర్డు మెంబర్, కేడీసీసీ డైరెక్టర్ గా సుదీర్ఘకాలం పాటు సేవలందించిన నాగేంద్రనాథ్ మృతి బాధాకరమన్నారు. అన్నదాతలకు అండగా ఉన్న ఆయన మృతి రైతన్నకు తీరని లోటు అని తెలిపారు. ఆయన భార్య సీతాదేవి మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాస్, నెట్టెం. రఘురాం, మాజీ ఎంపీ కొనగళ్ళ .నారాయణ, పొలిట్ బ్యూరో సభ్యులు టి. డి జనార్ధన్, పైడిపాటి. శివశంకర్, లావేటి. వీర శివాజీ, వేంపాటి. విష్ణు పుల. రాజి, బి కె ఎం నాని తదితరులు పరామర్శించారు.

రోజాపై బండారు అనుచిత వ్యాఖ్యలకు నిరసన

విశాలాంధ్ర-టి నరసాపురం: మంత్రి రోజా పై టిడిపి నాయకులు బండారు సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల వైఎస్సార్ సీపీ నాయకులు భూక్యా వేణుగోపాల్, ధరావత్ రమేష్ ఆధ్వర్యంలో టి నరసాపురం పంచా యతీ కృష్ణాపురంలో బుధవారం

నిరసన ప్రదర్శనలు చేసి బండారు సత్యనారాయణ వ్యాఖ్యానాలను ఖండించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం భారతీయ సాంప్రదాయం అన్నారు. బండారు సత్యనారాయణపై చట్ట పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, జరబల రామకృష్ణ, భూక్య కృష్, హసావత్ వెంకటేశ్వరరావు, భూక్య బాబురావు, లావుడియా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్రంలో ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల కేంద్రమైన కిర్లంపూడి కొక్కొండ రామ

శేషగిరి పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతీ ఇంటికి వెళ్ళి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఈ కార్యక్రమంలో జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలతారాంబాబు, కిర్లంపూడి ఎంపీడీఓ బదే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషని వైసీపీకి తెలుసు

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : 14 ఏళ్లపాటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు నిర్దోషని అధికార వైకాపా వారికి తెలుసని అతన్ని కావాలనే అక్రమంగా కేసుల్లో ఇరికించి జైలు పాలు చేశారని, మంత్రి రోజాకు చెందిన వీడియో ఫిలిం ఎవరు బయటకు విడుదల చేశారో వారిని అరెస్ట్

చేయాలని లేని పక్షంలో వచ్చే తమ టీడీపీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత చంద్రబాబును కావాలనే అన్యాయంగా అక్రమంగా జైలు పాలు చేసి వారంతా వికృత ఆనందం పొందుతున్నారన్నారని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అనిశెట్టి సత్యనారాయణ రెడ్డి, దేవరపల్లి రామారావు, బర్లంకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసి ఎయిడ్స్, టిబి కంట్రోల్ కార్యాలయంలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి వారి కార్యాలయ పరిధిలో ఎన్ హెచ్ఎంఎన్ టిఇపి స్కీంలో భీమవరం జిల్లాలో ఒక మెడికల్ ఆఫీసర్ (డిటిపిసి), ఒక ఎడ్యూకేట్ ఆఫీసర్, ఒక పిపిఎం కో-ఆర్డినేటర్, ఒక ఎక్కౌంటెంట్, ఏలూరు జిల్లాలో ఒక జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, ఒక సీనియర్ డిఆర్ టిబి-టిబిహెచ్ ఐవి సూపర్ వైజర్, ఉమ్మడి జిల్లా పరిధిలో పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జి. రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం గం.5లోపు కార్యాలయ పని దినాలలో ఏలూరులోని జిల్లా క్షయ వ్యాధి నివారణ కార్యాలయంలో అందజేయాలన్నారు.